# పలుకవేమి నాదైవమా!

**కా**ఫీ గ్లాసు చేత్తో పుచ్చుకుని వయ్యారాలూ "పలుకవేమి నా దైవమా" అందిట ఒక ఇల్లాలు. "ఇంకా పళ్ళు తోవుకోలేదే దేవతా" అన్నాడట. ఆ ఇల్లాలి నిజభర్త. నిజదార సుతోదర పోషణార్థమై మంచం మీంచి లేవాలంటే అతనికి కీళ్ళనొప్పులూ కాళ్ళనొప్పులూ పిలవకుండానే వస్తాయి. "నోరు మంచిదైతే వూరు మంచిదవుతుంది. లెగండి స్వామీ" అందిట ఆ సన్నుతాంగి. ఆవిడ ఒకప్పుడు సన్నగా వుండేది. తరువాత్తరువాత లావెక్కింది. విచారభారంతో బరువెక్కింది. కాఫీగ్లాసు చేత్తో పుచ్చుకుని వయ్యారాలు పోతూందని తెలుసుకున్నామా - అవి ఆవిడ కాఫీ వయ్యారాలు (ఫస్ట్ కాఫీ ఆవిడే తాగుతుంది) నోరు మంచిదైతే వూరు మంచిదవుతుంది. ఫలానా టూత్‌పేస్టు వాడండి అన్న వ్యాపార ప్రకటనకు సూటైయ్యేలా టూత్‌బ్రష్, పేస్టూ నాలిగ్గీసుకునే ముక్కా బుజంమీద తువ్వాలతో ఆవిడ రోజూ మొగుడికి పళ్లు కడిగించాల్సిందే. "నాలిగ్గీసుకోడం మర్చి పోయినట్లున్నారు" అనగానే నోరు తెరుస్తాడతను. "అమ్మా మన్ను తినంగ నే శిశువునో ఆకొంటినో వెర్రినో" అన్లేడతను. "కలయో వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో" అని తెల్లబోవనూ లేదా ఇంతి. కాని "మరోమారు నాలిగ్గీసుకోండిచాలు" అని తృప్తిగా అతడినోరుమూయిస్తుంది.

కాఫీలయాక "ఇవాళ గడ్డం గీసుకోమంటావా" - అని తన ముఖ సమస్యపై ఆవిడ తీర్పును అభిలషిస్తాడు. అబ్బే! ఎందుకండీ రేపు ఆదివారమేగా సోమవారం ఉదయం చేసుకోండి చాలు అనో, ఆహా! అలా కాదు - దేవదాసులా వున్నారు చేసుకోండి అనో ఆవిడ తీర్పు యిచ్చిన మీదట అద్దంముందు కూలబడతాడు. ఆవిడోమాటు తొంగి చూస్తూ వుంటుంది. "పరధ్యానంలోపడి మీసం గీకేసుకోగల్రు" అని ఆవిడ ఆడే హాస్యాలు వినపడుతూనే వుంటాయి. "ప్చ్! ఏవిటీ - మీసమా... చిన్నది చేయమంటావా?" ఆమె "వొద్దు, వున్న దున్నట్టుణ్నీండి" .....

"దట్సాల్ ... అసలు మన మొహం ఎలా వుందీ?" ఆమె- "మీ మొహాని కేవండి నిక్షేపరాయుళ్ళాగున్నారు" "అది కాదే మన మొహానికి కలరొచ్చినట్టు లేదూ" ఆమె "అది కలరనుకుంటున్నారా రామరామ, కిటికీ లోంచి ఎండొచ్చి మీ మొహాన్న పడుతూంది." "అది కాదు నా బాడీకి కూడా రంగొచ్చినట్లు లేదూ" ఆమె "రక్తం పలచబడిందేమో. మనిషి కూడా పాలిపోయినట్టు కనిపిస్తున్నారు. పది రూపాయలు పారేసి డాక్టరు కోమాటు చూపించుగోరాదూ?" "అబ్బ నేను నా సౌందర్యం గురించి మాట్లాడుతూంటే నువ్వు దాన్ని అనారోగ్యంలోకి దింపుతున్నావు?" ఆమె "మగాళ్ళకి అందచందాలేవిటి, ఆరోగ్యమే ముఖ్యం", "అబ్బ చూసుకో లేదు మాటల్లో గడ్డం తెగింది. వెధవ బ్లేడు" ఆమె "వుండుండుండండి పటికముక్కతో రుద్దుదురుగాని" "మొగాళ్ళకి నిత్యము ఇదో తద్దినం పెట్టాడు భగవంతుడు. ఈ బాధపడలేక

గడ్డం పెంచేద్దావని చూస్తున్నాను" ఆమె "గడ్డాన్ని మట్టుకు పోషించవద్దా." "జనక మహారాజు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, జార్జి బెర్నార్డ్‌షా, టాగోరు, మరేమో అరవిందయోగి, రామకృష్ణ పరమహంస వీళ్ళందరూ గడ్డాల్ని పెంచలేదా? అబ్రహాం లింకన్, టాల్‌స్టాయ్, చెహోవ్, లెనిన్ యిలాంటి మహానుభావులంతా గడ్డాలు పెంచారు యీ బాధపళ్ళేక". ఆమె! అవ్వేం మాటలండీ, ఆడాళ్ళకు యింకెన్నిన్ని బాధలున్నాయి? మగాళ్ళకి అదోహటేగా –ఆ మాత్రానికే ప్రపంచం తలక్రిందులైనట్లు గాబరాపడిపోవాలా."

ఇలా సాగుతుంది కొందరి జీవనయాత్ర. వాళ్ళని పెళ్ళాం కొంగుచాటు మనుష్యులని అంతా వెక్కిరించే మాట నిజమే కాని తమబరువు బాధ్యతలను యిలా అక్కలమీదో, చెల్లెళ్లమీదో, వదినలమీదో, తల్లుల మీదో, పెళ్ళాలమీదో వేసి బ్రతికే వారిని అమాయకులని లోకం క్షమించి వదిలేస్తుంది. కాని చాలామంది పుణ్య పురుషులు ఈ కోవలోకి వస్తారు. ఆడది హాండ్‌మైడ్‌లాగ వేలట్ లాగ కొండొకచో గురువులాగా అన్ని విషయాల్లోనూ పురుషునికి ఛాయలాగ వెన్నాడుతూ ఉత్తేజ పరుస్తూ వుండక పోతే జగన్నాథ రథచక్రాలు నడవ్వు. డ్రడ్జరీలో మటుకు ఆడదానికి ఆనందములేదనా – ఆవిడ ఫామిలీయే ఆవిడకు జగన్నాథుడిరథం. ఆ రథాన్ని లాగటం మటుకు సామాన్యమైన విషయం కాదు. నేను పైన చెప్పిన ఆవిడ మొగుడ్ని చంటిబిడ్డను సాకినట్లు సాగుతుంది. చొక్కా ఎప్పుడు మార్చాలో ఆవిడ చెప్పాలి. బుష్ షర్ట్‌కి కొలతలు ఆవిడ చెప్పి వదులుగా ఉండాలో శరీరాన్ని బట్టి వుండాలో టైలరుకి ఆవిడ సూచనలు ఇవ్వాలి. ఆవిడకు ఓ పేరంటానికి వెళ్ళడానికి వీలుండదు, పుట్టింటికి గాని, చుట్టాలింటికి గాని వెళ్ళడానికి వీలుండదు. పైకి కనపడే పితృస్వామ్యంలో అంతర్గర్భితంగా మాతృస్వామ్యం యిలా విస్తరించి వుంటుంది. ఆడపెత్తనం, ఆడపెత్తనం అని అంతా లోకువకట్టి మాటలంటారు కాని మగ మహారాజులు విజయవంతంగా జగన్నాథ రథ సారధ్యాన్ని నిర్వహించే సత్యభామలు దొరికి నప్పుడు అస్త్రసన్యాసం చేసి ఆ రథంమీదే పడుకుని నిద్రపోవడానికి యిష్టపడతారు.

మేల్ డామినేషన్ యింతగా వున్న ఈ భూ ప్రపంచంలో ఆడదానికి వంటింటి డ్రడ్జరీని తగ్గించేయాలంటే ఏదైనా సింపుల్ నివారణోపాయం బెణుకు మంత్రం, తేలు మంత్రం, పాముకాటు మంత్రం లాంటిది వుందా అంటే కనుచూపుమేరలో అదీలేదు. పైగా అమాయకులు, అప్రయోజకులు నోట్లో వేలుపెడితే కొరకలేని పురుషుల వలన యింతులకు మేల్బంతులకు కుటుంబ డ్రడ్జరీ అధికాధిక మవుతున్నదే కాని తగ్గటం లేదు. మోడ్రన్ ఆడది ఏమంటున్నదంటే నా మొగుడు నేను పిలవగానే "ప్రజంట్‌సార్" అనేట్లుంటే చాలనుకుంటోంది. క్లబ్బుల కెళ్ళకుండా, పేకాడకుండా, తాక్కుండా, స్నేహితుల్తో తిరక్కుండా చాపమీద కుక్కలాగ తనపాదాల చెంత చోటు చేసుకుంటే చాలని ఆశిస్తోంది. తనతో షికార్లు సినిమాలకు వస్తే చాలని సంతోషించే స్థితిలో వుంది. పనిమనిషి దగ్గర్నుంచి పరాయి స్త్రీ వరకు కన్నెత్తిచూడని వాడై వుండాలని కోరుకుంటోంది. కాని తను మాత్రం సంప్రదాయానికి కట్టుబడి పవిత్ర భారత స్త్రీమూర్తి ఫోటోకి అసలుకి సరియైన నకలుగా వుండాలని కోరుకుంటుంది.

పవిత్ర భారతదేశం పవిత్ర భారతీయ స్త్రీ మూర్తి అనగానేనాకు వళ్ళంతా తేళ్లూ జెర్రులూ ప్రాకినట్టు కంపరమెత్తిపోతుంది. ఇహలోకంలో ఏదేశమూ పవిత్రం కానట్టూ ఏ దేశంలోని స్త్రీలూ పవిత్రులు కానట్టూ కోసే కోతలు యీ దేశంలో యింకా ఎంతకాలం దేశభక్తిగా, చెలామణి అవుతాయో నాకర్థం కావటంలేదు. భారత ప్రభుత్వం తెలిసో తెలియకో ఫామిలీ ప్లానింగ్ ద్వారా "సెక్స్ ఫ్రీడం"ని బ్లాంక్ చెక్కులా స్త్రీలకు ప్రసాదించింది. పురుషుల దౌర్జన్యాలన్నిటికి సమాధానం చెప్పగల ఒక మహాస్త్రాన్ని గవర్నమెంటు స్త్రీలకు యిచ్చింది. రేపటి ప్రపంచంలో తనకు బిడ్డ అవసరమాకాదా అని నిర్ణయించుకునేది స్త్రీ. పెళ్ళి చేసుకోవటమా ఉద్యోగం చేయటమా అనినిర్ణయించుకునేది స్త్రీ. గర్భధారణమనే శాపాన్నుండి విముక్తి స్త్రీకి లభించినపుడు యిప్పటి వ్యవస్థా స్వరూపాల్ని తల క్రిందుగా చేయగల వజ్రాయుధం ఆవిడ చేతిలో వుంటుంది. ట్రెడిషనల్ కన్సర్వేటిజంతో కుంచించుకుపోయిన వైవాహిక వ్యవస్థపై వజ్రాయుధాన్ని ప్రయోగించగలదు రేపటి స్త్రీ. ఇప్పుడు "పలుకవేమి నాదైవమా" అంటున్నారు ఆడాళ్ళు. మరికొందరు "పిలిచిన బిగువటరా ఔరౌర!" అంటున్నారు. రేపటి స్త్రీ అలా అనదు. ఆవిడ చేతిలో గవర్మెంటా ఫిండియావారి బ్లాంక్ చెక్కుంది. టేక్కేర్!

# నదీనదీ గోస్తనదీ

అత్తిలి నుంచి అమెరికా వెళ్తే ఎలాగుంటుందో నా చిన్నప్పుడు మా వూర్నించి తణుకు బస్తీకి వెళ్ళినపుడు అలాగనిపించేది. తణుకు పేరు జ్ఞాపకం వచ్చినపుడల్లా నాకు గోస్తనది జ్ఞాపకం వస్తుంది. వంకర నడత కలవారిని అనేకమందిని మనం చూసి వుంటాం, కాని తణుకులో గోస్త నది వారందర్నీ మించిపోతుంది. ఎవరి దొడ్డిగుమ్మం తలుపుతీసినా గోస్తనదే నవ్వుతూ పలకరిస్తుంది. కాలవని నది అంటే ఎవరికైనా నవ్వొస్తుందా రాదా? గోస్తనదిని నది అనకుండా కాలవ అంటె తణుకులో ఎవరి కైనా యిట్టే కోపం రావచ్చు.

రేవు పావంచాలమీద కూర్చుని ఆ నీళ్లలో అలా పాదాలు ముంచగానే గోస్తనది కిలకిలా నవ్వుతూ మాతో కబుర్లు చెప్పడము ప్రారంభిస్తుంది. మాకు కంఠతా వచ్చిన పాటలన్నీ అక్కడే కూర్చుని పాడి గోస్తనదికి వినిపించే వాళ్ళం. మా ఆటలు, మా కబుర్లు, మా నవ్వులూ వింటూ మౌనంగా సాగిపోయే గోస్తనదిని ఎట్లా మర్చిపోవటం? గట్లను రాసుకుని కొత్తకాలువ పూటుగా వున్నపుడు దగ్గరకు వెళ్ళటానికే భయం వేసేది. వేసంకాలం కాలవలు కట్టేస్తారు కదా – అప్పుడు మోకాలి లోతునీళ్ళలో గెంతడం మాకు చెడ్డ సరదాగా వుండేది. పొద్దస్తమానం కాలవ లోనే నాన్తూ తేల్తూ వుండేవాళ్ళం.